జిల్లా కేంద్రాస్పత్రి సందర్శన

టెక్కలి రూరల్: టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రిని వైద్య ఆరోగ్య శాఖకు చెందిన సెంట్రల్ టీం ప్రతినిధులు బుధవారం పరిశీలించారు. ఇన్ఫెక్షన్ ప్రివెన్షన్ కంట్రోల్ కన్సల్టెంట్ డాక్టర్ నీరద ఆస్పత్రిలో రోగులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కరోనా వైరస్ విజృంభించిడంతో ఒకరి నుంచి మరొకరికి సోకకుండా వైద్య సిబ్బందికి శిక్షణ ఇస్తామని చెప్పారు. బ్లౌజులు, మాస్కులతో చికిత్స అందించాలని సిబ్బందికి సూచించారు. రోగులకు సకాలంలో వైద్యం అందేవిధంగా కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ బొడ్డేపల్లి సూర్యారావు, డాక్టర్ లక్ష్మణరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న సెంట్రల్ టీమ్

కేజీకి రూ.6.90 పైసలు

- వరికి కేంద్రం పెంచిన మద్ధతు ధర
- రైతులపై మోడీ ప్రభుత్వ ప్రేమ తేటతెల్లం
- ఏటా పెరుగుతున్న పంట ఖర్చులు
- కేంద్రం మద్దతు ధరపై అన్నదాతల మండిపాటు

కేంద్ర ప్రభుత్వానికి రైతులపై ఏ మాత్రం కనికరం లేదని తేటతెల్లమవుతోంది. బడ్జెట్ సమయంలో వారి సంక్షేమానికి గొప్పలు చెప్పే మోడీ ప్రభుత్వం వారి కష్టానికి తగిన మద్దతు ధర ఇచ్చే విషయంలో కఠినంగానే ఉంటోంది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తాజాగా ప్రకటించిన పంటల మద్దతు ధరే అందుకు ఉదాహరణ. ఎరువులు, పురుగు మందులు, డీజిల్, ఇతర యంత్ర పరికరాల రేట్లు, అద్దెలు ఒకవైపు పెరుగుతున్నా... పంటలకు మద్దతు ధర పెంచేందుకు మనస్కరించడం లేదు. వరికి కేజికి కేవలం రూ.6.90 పైసలు (క్వింటాకు రూ.69) మాత్రమే పెంచి చేతులు దులుపుకుంది. గతేడాది రూ.117 పెంచగా, ఈ సారి ఏకంగా రూ.48 తగ్గించి ధర ప్రకటించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పంట ఖర్చులు అధికంగా పెరిగిన నేపథ్యంలో మద్దతు ధరపై ఆశలు పెట్టుకున్న అన్నదాతలకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రైతులను తీవ్ర నిరాశకు గురి చేసింది.

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో వరి ప్రధాన పంటగా ఉంది. ఖరీఫ్, రబీ సీజన్లల్లో కలిపి మొత్తం 5.59 లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. ఖరీఫ్‌లో 5,09,238 ఎకరాల్లోనూ, రబీలో 50 వేల ఎకరాల్లో వరి పంట పండిస్తున్నారు. రెండు సీజన్ల్లో కలిపి మొత్తం 12 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం దిగుబడి వస్తోంది. రైతులు సొంత అవసరాలకు పోను పది లక్షల టన్నులకు పైగా ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు అమ్ముతున్నారు. 2022 ఖరీఫ్ సీజన్‌లో కేంద్ర ప్రభుత్వం వరికి క్వింటాకు రూ.వంద పెంచడంతో అప్పటివరకు రూ.1940 వరకు ఉన్న సాధారణ రకం ధాన్యం ధర రూ.2040కు పెరిగింది. అదేవిధంగా గ్రేడ్ 'ఎ' రకం రూ.1960 నుంచి రూ.2060కి పెరిగింది. ప్రస్తుతం అంటే క్వింటాకు రూ.143లు పెంచడంతో సాధారణ రకానికి రూ.2,183లు, గ్రేడ్ ఎ రకానికి రూ.2,203లు దక్కనుంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరపై రైతులు పెదవి విరుస్తున్నారు. పంట ఖర్చులు విపరీతంగా పెరిగిన తరుణంలో ఇది ఏ మూలకు సరిపోతుందని అన్నదాతులు ప్రశ్నిస్తున్నారు.

పెరిగిన పంట ఖర్చులు

గతేడాదితో పోలిస్తే పంట ఖర్చులు విపరీతంగా పెరిగాయి. గత ఖరీఫ్ సీజన్‌లో దుక్కులకు రూ.2,600 నుంచి రూ.3,600 చెల్లించాల్సి ఉంటుందని రైతులు చెప్తున్నారు. పురుగు మందుల కోసం గతేడాది రూ.2,500 ఖర్చు చేయగా ప్రస్తుత సంవత్సరంలో రూ.3 వేల వరకు పెరిగింది. ఊబాల కోసం 2024 ఖరీఫ్‌లో రూ.7,500 వేలు ఖర్చు చేయగా, ఇప్పుడు రూ.8 వేల వరకు ఖర్చు ఉంటుందని రైతులు అంటున్నారు. గడ్డి మందు కోసం గత ఖరీఫ్‌లో ఎకరాకు సుమారు రూ.2 వేలు ఖర్చు చేయగా, రూ.200 నుంచి రూ.300 వరకు పెరిగే అవకాశం ఉంది. పెట్రోల్ సెంచరీ దాటగా డీజిల్ ధరలు సెంచరీకి సమీపంలో ఉంది. ప్రస్తుతం లీటరు పెట్రోల్ రూ.109.47 పైసలు ఉండగా, డీజిల్ రూ.98.20 ఉంది. గతేడాదితో పోలిస్తే పెట్రోల్, డీజిల్ ధరల్లో పెద్దగా మార్పులు లేకపోయినా పంట కాలంలో వినియోగిస్తున్న యంత్రాల అద్దెలు పెరిగాయి. వర్షాలు కురిస్తే ఈ ఖర్చులు ఉంటాయి. గతేడాది మాదిరి తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉత్పన్నమయితే ఈ వ్యయం మరింత పెరిగే అవకాశం ఉంటుంది. పొలాలకు నీరు పెట్టేందుకు వినియోగించే ఇంజిన్లు అద్దె పెరిగే అవకాశాలు లేకపోలేదు. కోత మిషన్ అద్దె, పొలం నుంచి ఇళ్లకు ధాన్యం తరలించేందుకు ట్రాక్టర్ల అద్దెలూ పెరగనున్నాయి. రూ.5,500 నుంచి రూ.6,500 వరకు ఉంటుందని రైతులు చెప్తున్నారు. చివరకు ఇళ్ల ధాన్యం తెచ్చుకునేందుకు గతేడాది రూ.300లు చెల్లించగా, ఇప్పుడు అదనంగా మరో రూ.50లు చెల్లించాల్సి ఉంటుందని చెప్తున్నారు. మొత్తం మీద ఈ ఏడాది అదనంగా రూ.5 వేలు ఖర్చవుతుందని రైతులు అంచనా వేస్తున్నారు. ఎకరాకు రూ.20 వేలు కాగా ప్రస్తుతం రూ.25 వేలు వరకు ఖర్చవుతుందని రైతులు అంచనా వేస్తున్నారు.

వరికి క్వింటాకు గత ఐదేళ్లలో కేంద్రం పెంచిన మద్ధతు ధరలు ఇలా ఉన్నాయి...

సంవత్సరం	పెంపు (రూ.లో)	సాధారణ రకం వరి క్వింటాకు మద్ధతు ధర (రూ.లో)
2020-21	53	1,868
2021-22	72	1,940
2022-23	100	2,040
2023-24	143	2,183
2024-25	117	2,300
2025-26	69	2,369

రూ.69తో రైతుల ఆదాయం ఏం రెట్టింపవుతుంది?

కేంద్ర ప్రభుత్వం చాలా నామామాత్రంగానే మద్దతు ధర ప్రకటించింది. వ్యవసాయ ఇన్‌పుట్స్ ధరలను ఏటా 30 నుంచి 40 శాతం పెరుగుతున్నాయి. మద్దతు ధర పెంచామని చెప్పుకోవానికే కేంద్రం తప్ప రైతులకు ఇది ఏమాత్రం గిట్టుబాటు కాదు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామంటూ పదే పదే గొప్పలు చెప్పే మోడీ రూ.69తో ఏం రెట్టింపు చేస్తారు. ఢిల్లీలో రైతుల ఆందోళనల తర్వాత పంటలకు గ్యారంటీ మద్దతు ధర చట్టం చేస్తామని మోడీ హామీ ఇచ్చినా ఇప్పటివరకు అమలు చేయకపోవడం రైతులపై కేంద్రం చిత్తశుద్ధిని తెలియజేస్తోంది.

- కె.మోహనరావు, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి

గిరిజనుల సమగ్రాభివృద్ధే ధ్యేయం

- ఇళ్లు, మౌలిక వసతులకు పెద్దపీట
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

గిరిజనుల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ఒక ప్రకటనలో తెలిపారు. పిఎం జన్ మాన్ పథకం కింద ఆదివాసీలకు సురక్షిత గృహాలు, తాగునీరు పారిశుధ్యం, విద్య, ఆరోగ్యం, పోషకాహారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. సీతంపేట, ఐటిడిఎ ద్వారా 551 పివిటిజి గ్రామాల్లో 1742 గృహాలు మంజూరు చేశామన్నారు. గిరిజన గ్రామాల్లో 13.70 కిలోమీటర్ల మేర రహదారులకు రూ.10.24 కోట్లు, 26 తాగునీటి పథకాలకు రూ.2.93 కోట్ల నిధులు కేటాయించామని వెల్లడించారు. 27 అంగన్వాడీ కేంద్రాలు, 15 బహుళార్థక కేంద్రాలు, 3 హాస్టల్లో పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. 551 గిరిజన ఆవాసాలకు విద్యుదీకరణ జరిగిందని, 26 బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్ల పనులు పూర్తయ్యాయని తెలిపారు. 38 వన్‌ధన్ వికాస కేంద్రాలు మంజూరు కాగా అన్నీ పని చేస్తున్నాయన్నారు. 258 గ్రామసభల ద్వారా 5211 ఆధార్ కార్డులు, 1345 ఆయుష్మాన్ భారత్ కార్డులు, 567 పిఎం కిసాన్ యోజన కార్డులు, 45 జన్ ధన్ యోజన, 27 మాతృ వందన యోజన, 116 అటవీ హక్కుల చట్టాలు, 3564 కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేశామన్నారు.

సిఎం జుగా కార్యక్రమంలో భాగంగా సీతంపేట ఐటిడిఎ పరిధిలోని 13 మండలాల్లో 50 శాతానికి పైగా ఉన్న 34 గిరిజన గ్రామాలను ఎంపిక చేశామన్నారు. అదేవిధంగా పిఎం జుగా కార్యక్రమంలో పాఠశాలల అభివృద్ధి, గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల పెద్దమడి, గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల వెన్నెలవలస, గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల బొమ్మిక పాఠశాలలను ఎంపిక చేశామన్నారు. ఈ మూడు పాఠశాలల్లో రూ.2.20 కోట్లతో తరగతి గదులను నిర్మించుటకు నిధులు కేటాయించామని తెలిపారు. రూ.7.17 కోట్లతో వసతిగృహ భవనాలను నిర్మించుటకు నిధులు కేటాయించామన్నారు. రూ.2.70 కోట్లతో ఉపాధ్యాయులకు, సిబ్బందికి క్వార్టర్స్ భవనాలను నిర్మించేందుకు నిధులు కేటాయించామని చెప్పారు. రూ.22 లక్షలతో మూడు పాఠశాలల్లో ఫర్నిచర్ కొనుగోలుకు నిధులు కేటాయించామన్నారు. రూ.1.06 కోట్లతో మూడు పాఠశాలల్లో మరమ్మతులు, ఆధునీకరించుటకు నిధులు కేటాయించామని తెలిపారు.

రైతులకు ఊరట

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెనాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

దేశంలో రైతాంగానికి కేంద్ర ప్రభుత్వం ఊరట కలిగించిందని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పలు పంటలకు రైతాంగం పండించిన పంటలకు మద్దతు ధరను పెంపునకు ఆమోద ముద్ర వేయడంతో రైతన్నకు ఊరట నిచ్చిందన్నారు. వరికి కొత్త మద్దతు ధరను ప్రకటిస్తూ కేంద్ర క్యాబినెట్ బుధవారం ఆమోద ముద్ర వేయడంతో క్వింటాల్ వరిపై రూ.69 కనీసం మద్దతు ధర రూ.2369 చేరుతుందని పేర్కొన్నారు. ఈ పెంపు రైతులకు ఎంతగానో ఉపయోగపడుతోందని అన్నారు. అదేవిధంగా రైతులకు ప్రయోజనం చేకూరేవిధంగా వడ్డీ రాయితీని కూడా ప్రకటించడం సంతోషదగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి రైతులు తరపున కృతజ్ఞతలు తెలిపారు.

కంప్యూటర్ ఆపరేటర్ వక్రబుద్ధి

- మహిళా ఉద్యోగిణి వీడియో చిత్రీకరణ
- పట్టుకున్న మహిళా ఉద్యోగి, పోలీసులకు ఫిర్యాదు
- కలెక్టరేట్‌కు సరెండర్

ప్రజాశక్తి- పొందూరు

ప్రభుత్వ కార్యాలయాల్లో సైతం కొంతమంది వక్రబుద్ధి కారణంగా మహిళా ఉద్యోగిణిలకు కూడా వేధింపులు తప్పడం లేదు. పొందూరు తహశీల్దార్ కార్యాలయంలో బాత్‌రూంలో ఉన్న ఉద్యోగిణిలకు అక్కడ పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ రహస్యంగా వీడియోలు చిత్రీకరించాడు. ఈ విషయాన్ని గమనించిన ఉద్యోగిణి అతని వద్ద నుంచి సెల్‌ఫోన్ తీసుకుని వీడియోలను డిలీట్ చేశారు. దీనిపై సంబంధిత ఉద్యోగిణి తహశీల్దార్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులు, పోలీసుల సమాచారం మేరకు పొందూరు తహశీల్దార్ కార్యాలయానికి మండలంలోని ఓ సచివాలయంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగిణి మంగళవారం మ్యుటేషన్ల నిమిత్తం కార్యాలయానికి వచ్చారు. ఆ సమయంలో తన అవసరం నిమిత్తం బాత్‌రూంకు వెళ్లి బయటకు వచ్చిన అనంతరం పైకి చూడగా పక్కనే ఉన్న పురుషుల బాత్‌రూం నుంచి సెల్‌ఫోన్ కనిపించింది. అనుమానంతో ఆ సెల్‌ఫోన్ తీసుకుని చూడగా కార్యాలయంలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ సువ్వారి సన్యాసిరావుగా గుర్తించారు. ఈ సెల్‌ఫోన్‌ను చూడగా బాత్‌రూంలో ఉంటుండగా రహస్యంగా చిత్రీకరించిన తన వీడియో కనిపించింది వెంటనే ఆ వీడియోను డిలీట్ చేసింది. దీనిపై ఆ మహిళా ఉద్యోగిణి బుధవారం తహశీల్దార్ వెంకటేష్‌రామానుజులుకు, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కంప్యూటర్ ఆపరేటర్ సన్యాసిరావును పిలిపించి ప్రశ్నించగా, మౌనం దాల్చినిట్లు తహశీల్దార్ తెలిపారు.

పోలీసులు కేసు నమోదు

మహిళా ఉద్యోగిణి ఫిర్యాదు మేరకు కంప్యూటర్ ఆపరేటర్ సన్యాసిరావుపై స్థానిక ఎస్ఐ వి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు. సన్యాసిరావు సెల్‌ఫోన్‌ను స్వాదీనం చేసుకుని స్టేషన్‌లో విచారణ చేపట్టారు.

కలక్టరేట్‌కు సరెండర్

తహశీల్దార్ కార్యాలయంలో బాత్‌రూంలో వీడియోలు తీస్తున్నట్లు గుర్తించిన మహిళా ఉద్యోగిణి తహశీల్దార్ వెంకటేష్‌రామానుజులుకు ఫిర్యాదు చేశారు. దీనిపై సన్యాసిరావును పిలిపించి మాట్లాడిన అనంతరం పై అధికారులకు తహశీల్దార్ ఈ విషయాన్ని తెలియజేశారు. అనంతరం సన్యాసిరావును కలెక్టరేట్‌కు సరెండర్ చేస్తూ ఉత్తర్వులను జారీ చేసినట్లు తహశీల్దార్ తెలిపారు.

19న పిసిసి అధ్యక్షులు షర్మిల రాక

డిసిసి అధ్యక్షులు కృష్ణారావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఎపి కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వై.ఎస్.షర్మిల జూన్ 19న జిల్లాలో పర్యటిస్తున్నట్టు డిసిసి అధ్యక్షులు అంబటి కృష్ణారావు, జిల్లా ఇన్‌ఛార్జి గాదం వెంకట త్రినాథరావు తెలిపారు. నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో బుధవారం కార్యకర్తలతో సావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంలో భాగంగా షర్మిల పర్యటిస్తున్నట్టు తెలిపారు. 2029 ఎన్నికల నాటికి కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయిలో సిద్ధమవుతుందని స్పష్టం చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఎన్నికకల ముందు ఆచరణ కానీ హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చిందన్నారు.

మాట్లాడుతున్న కృష్ణారావు

ప్రస్తుతం లోటు బడ్జెట్ పేరుతో పేద, బడుగు, బలహీన వర్గాల మోసం చేశారని ఓట్లు దండుకున్న తర్వాత ముఖం చాటేసిన కూటమి నాయకులు గతంలో కూడా ఇదే పంతాను అమలు చేసిందని దుయ్యబట్టారు. ఇంటింటికీ రేషన్ పథకాన్ని అమలవుతున్న తరుణంలో ఎండియు వాహనాలను రద్దు చేయడం సరికాదన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ప్రజాధనాన్ని వృథా చేయడం సరికాదన్నారు. పాఠశాల విలీనం, ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ పేరుతో విద్యార్థులకు, తల్లిదండ్రులకు చుక్కలు చూపిస్తున్నారని, ఇది ఎంతవరకు సమంజనమని ప్రశ్నించారు. సమావేశంలో నియోజకవర్గ కో-ఆర్డినేటర్లు ఆబోతుల వెంకట నాయుడు, బొచ్చ వెంకటరమణ, మామిడి సత్యనారాయణ, జిల్లా బిసి సెల్ అధ్యక్షులు అంబటి దాలినాయుడు జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు చాన్ భాష, డిసిసి ఉపాధ్యక్షులు కె.వి.ఎల్.ఎస్.ఈశ్వరి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి

పసుపు నారు మొక్కల పెంపకంపై శిక్షణ

ఆమదాలవలస: ఆమదాలవలస కృషి విజ్ఞా కేంద్రంలో సీతంపేట గిరిజన అభివృద్ధి వద్ధి సంస్థ ఆధ్వర్యాన పసుపు నారు మొక్కలను పెంచుకొనే విధానంపై గిరిజన యువ రైతులకు బుధవారం నైపుణ్య శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించామని ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ వి.హరికమార్ పసుప నారు మొక్కల తయారీ విధానం గురించి రైతులకు వివరించారు. ఈ విధానం ద్వారా రైతులకు విత్తనం చాలా ఆదా అవుతుందని, సాంప్రదాయ పద్ధతిలో ఎకరాకు వినియోగించే విత్తనాలను ప్రో ట్రే పద్ధతిలో మూడు ఎకరాలకు వాడ వచ్చునని అన్నారు. జూన్ రెండో వారం వరకు కూడా నారు ప్రధాన పొలంలో వేసుకోవచ్చుని తెలియజేశారు. ఆమదాలవలస, కొత్తూరు, పార్వతీపురం మన్యం జిల్లా భామిని, సీతంపేట రైతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్లు అనూష, జి.ఎస్.రాయ్, సునీత, కిరణ్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఫీజులపై ఫిర్యాదు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రభుత్వ జునియర్ కళాశాలల్లో వివిధ ఒకేషనల్ కోర్సుల ఫీజుల భారాన్ని తగ్గించాలని, మొదటి సంవత్సరం విద్యార్థుల ప్రవేశ రుసుంవిషయంలో నెలకొన్న గందరగోళం విషయంలో స్పష్టత ఇవ్వాలని జెఎల్‌సి ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ఇంటర్ విద్యాధికారి ఆర్.సురేష్ కుమార్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. ఒకేషనల్ కోర్సుల్లో ప్రవేశం పొందుతున్న మొదటి సంవత్సరం విద్యార్థుల ప్రవేశ రుసుం విషయంలో కొన్ని కళాశాలల్లో ఒకవిధంగానూ, మరికొన్ని కళాశాలల్లో మరోరకంగానూ ఫీజులు వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. కమిషనర్ ఇచ్చిన ఆదేశాల ప్రకారం వృత్తివిద్యలో చేరిన విద్యార్థులు రెండు రకాల లేబొరేటరీ ఫీజులను మాత్రమే చెల్లించాల్సి ఉందన్నారు. కొన్ని కళాశాలలు సైన్స్ విద్యార్థుల కోసం ఉద్దేశించిన గ్రూప్-డిలో పేర్కొన్న ల్యాబ్ ఫీజు రూ. 495లను అదనంగా ఒకేషనల్ విద్యార్థుల వద్ద నుంచి వసూలు చేస్తున్నాయని డిఐఇఒ దృష్టికి తీసుకొచ్చారు. దీనివల్ల ఒకేషనల్ అడ్మిషన్లపై తీవ్ర ప్రభావం పడుతోందన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో చేరే విద్యార్థులకు ప్రభుత్వం పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగు, ఉచిత భోజనం అందిస్తూ ప్రవేశాలు పెరిగేందుకు కృషి చేస్తుస్తుందని అన్నారు. పేద విద్యార్థులపై అదనపు ఫీజు భారం మోపడం అన్యాయమన్నారు. అదనంగా వసూలు చేస్తున్న రూ.495 వల్ల ఒకేషనల్ గ్రూప్‌లో చేరి పేద విద్యార్థులపై ఆర్థికభారం పడుతోందని గుర్తుచేశారు. గ్రూప్-డిలో పేర్కొన్న సైన్స్ విద్యార్థుల లేబొరేటరీ ఫీజు నుంచి ఒకేషనల్ విద్యార్థులను మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఈ విషయమై ఉన్నతాధికారులతో చర్చించి ఫీజు తగ్గింపుపై స్పష్టమైన ఆదేశాలు త్వరలో జారీ చేస్తామని డిఐఇఒ హామీఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం ప్రతినిధి కరణం రవీంద్రనాథ్ ఠాగూర్, స్టేట్ మీడియా కో-ఆర్డినేటర్ దుగ్గివలస రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న జెఎల్‌సి ప్రతినిధులు

17 కేంద్రాల్లో ఆధార్ సేవలు

పోస్టల్ సూపరింటెండెంట్ హరిబాబు

శ్రీకాకుళం: భారత ప్రభుత్వం తపాలాశాఖ, యుఐడిఐఎ ఆధ్వర్యాన శ్రీకాకుళం పోస్టల్ డివిజన్‌లోని 17 కేంద్రాల్లో అన్ని రకాల ఆధార్ సేవలు అందుబాటు లో ఉన్నాయని పోస్టల్ సూపరింటెండెంట్ వండాన హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త నమోదు, పేరు, చిరునామా, పుట్టిన తేదీ, మొబైల్ నంబరు, ఇమెయిల్ ఐడి తదితర నవీకరణ ఉంటుందన్నారు. ఫొటో, వేలిముద్రలు, ఐరిస్ స్కాన్లు, పిల్లల బయోమెట్రిక్ అప్‌డేట్, డాక్యుమెంట్ అప్‌డేట్ చేస్తున్నామని తెలిపారు. శ్రీకాకుళం, ఆమదాలవలస, టెక్కలి ప్రధాన తపాలా కార్యాలయాల్లో. రాజాం, పొందూరు, ఎస్.ఆర్.పురం, జె.ఆర్.పురం, అరసవిల్లి, గార, హిరమండలం, కొత్తూరు, నరసన్నపేట, కోటబొమ్మాళి, కాశీబుగ్గ, పలాస, సోంపేట, మందస ఉప తపాలా కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

సూర్యమహాల్ థియేటర్ తనిఖీ

శ్రీకాకుళం ప్రతినిధి: శ్రీకాకుళం నగరంలోని సూర్యమహాల్‌ను ఆర్‌డిఒ సాయి ప్రత్యూష తనిఖీ చేశారు. థియేటర్ లైసెన్స్ పత్రాలను పరిశీలించారు. క్యాంటీన్లలో తినుబండారాల నాణ్యతను చూశారు. ధరల వివరాల పట్టికను పరిశీలించారు. థియేటర్‌లో పారిశుధ్య పరిస్థితులను మెరుగుపర్చాలని సూచించారు. ఎంఆర్‌పి కంటే అదనపు ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటామని యజమానులను ఆమె హెచ్చరించారు. కేంటీన్‌లో తూకం యంత్రాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. తినుబండారాల దుకాణానికి ఫుడ్ లైసెన్స్ లేకపోవడంతో నోటీసులు జారీ చేశారు. ఆమెతో పాటు ఆహార భద్రతా అధికారి కె.లక్ష్మి, తూనికలు, కొలతలు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు, చిత్రపరిశ్రమకు మధ్య ఇటీవల నెలకొన్న వివాదం నేపథ్యంలో థియేటర్లను తనిఖీ చేయాలని ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిసింది.

తినుబండారాల పట్టికను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ సాయి ప్రత్యూష

మహానాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

టిడిపితోనే రాష్ట్ర అభివృద్ధి

మహానాడులో ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస : తెలుగుజాతి ఖ్యాతి ఖండాలకు వ్యాపించిన ఎన్‌టిఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని నిరూపితమైందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. కడప జిల్లాలో నిర్వహించిన టిడిపి మహానాడు కార్యక్రమంలో బుధవారం శిరీషకు మాట్లాడేందుకు అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలకు మంచి చేసే విధంగా రాష్ట్ర అభివృద్ధిని ప్రపంచాలకు చూపిస్తున్నారని అన్నారు. రెట్టింపు ఉత్సాహంతో పార్టీని విజయవంతంగా నడిపిసున్నారని కొనియాడారు. పార్టీని ముందుకు తీసుకువెళ్తున్న యువ నాయకుడు నారా లోకేష్ అడుగుజాడల్లో టిడిపి పూర్తిస్థాయి అభివృద్ధి సాధించిందన్నారు. అధికారం వచ్చిన ఏడాది కాలంలోనే దేశం గర్వించే విధంగా ప్రాజెక్టులు తీసుకువచ్చారని అన్నారు. రాజధాని అమరావతిని పునర్నిర్మాణం చేస్తున్నారని తెలిపారు. విద్య, వైద్యం, రహదారులు, సాగు, తాగునీరు మొత్తం కల్పించి ప్రజల హృదయాలను చూరగొన్నారన్నారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో ప్రజలు అన్యాయాలు, అకృత్యాలు చూశారని అన్నారు.

ఎన్‌టిఆర్ ప్రజా వ్యవస్థలకు పునాది

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం: ఎన్‌టిఆర్ ప్రజా వ్యవస్థలకు పునాది అని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 102వ జయంతిని పురస్కరించుకొని నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి బుధవారం పూలమాలలు వేశారు. అనంతరం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఎన్‌టిఆర్ సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'నాది మహారాష్ట్ర... నేను చదువుకునే రోజుల్లోనే ఎన్‌టిఆర్ గురించి విన్నాను. ఆయన నిజాయితీపరుడు, దూరదృష్టిగల నాయకుడు. రాష్ట్రంలో పింఛను పథకానికి నాంది పలికింది ఆయనే. బ్లాక్ సిస్టమ్‌ను తొలగించి మండల వ్యవస్థను తీసుకొచ్చారు. ప్రజావ్యవస్థల్లో సమూల మార్పులకు పునాది వేశారాయన. తెలుగువారి గౌరవానికి ఆయనే ప్రతీక' అని వెల్లడించారు. ఎన్‌టిఆర్ జీవిత చరిత్ర ఆధారంగా ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనలతో కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, ఆర్‌డిఒ సాయి ప్రత్యూష, జెడ్‌పి సిఇఒ శ్రీధర్‌రాజా, నగరపాలక సంస్థ కమిషనర్ బి.వి.డి.ప్రసాదరావు ఎమ్మెల్యే గొండు శంకర్ సతీమణి గొండు స్వాతి, మాదారపు వెంకటేష్, జామి భీమశంకర్, కె.శ్రీహరి పాల్గొన్నారు.



ఎన్‌టిఆర్ ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

శక్తి యాప్‌పై అవగాహన

శ్రీకాకుళం: రాష్ట్ర ప్రభుత్వం మహిళలు భద్రత రక్షణకు అందుబాటులోకి తీసుకువచ్చిన శక్తి యాప్ ఉపయోగం, సేవలు, నిక్షిప్తం, రిజిస్ట్రేషన్ గురించి జిల్లాలో మహిళలు, విద్యార్థులకు శక్తి బృదాలు వాటి ఆవశ్యకత, ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఎస్‌పి కె.వి.మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు బుధవారం శ్రీకాకుళం, టెక్కలి, కాశీబుగ్గ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో శక్తి టీమ్ సిబ్బంది శక్తి యాప్‌తో మహిళలు, విద్యార్థులకు రక్షణ భద్రత ఉంటుందని వివరించారు. ప్రతి ఒక్క మహిళా శక్తి యాప్ తన ఫోన్‌లో నిక్షిప్తం చేసుకుని రిజిస్ట్రేషన్ కావాలని తెలిపారు. మహిళలు అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా శక్తి యాప్ ద్వారా 100,112, ఎస్ఒఎస్ బటన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు అని అన్నారు. మహిళలకు ఆపద సమయంలో అత్యవసర సాయం అందించేందుకు శక్తి యాప్ ఒక అయధంగా పనిచేస్తుందన్నారు. ఈ యాప్‌ను ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

అవగాహన కల్పిస్తున్న శక్తి బృందం

పాస్ పోర్ట్ పోయినది

నేను గేదెల కుశరాజు S/o రామారావు, ఇంటి నంబరు 1-255, హుకుంపేట కాలనీ, కొర్లాం గ్రామం, సోంపేట మండలం, శ్రీకాకుళం జిల్లా, ఆంధ్రప్రదేశ్ 532264.

నా యొక్క పాస్ పోర్ట్ నంబరు U6956065 కొర్లాం నుంచి బారువ కి బస్ లో బ్యాంక్ పని కోసం వెళ్తుండగా మార్గ మధ్యంలో నా పాస్ పోర్ట్ పోయినది. ఎవరికైనా దొరికిన యెడల బారువ పోలీస్ స్టేషన్ లో గాని ఈ కింది ఫోన్ నంబరు కి గానీ తెలియ చేయగలరు.

ఫోన్ నెంబరు : 9030070378

ధ్రువపత్రాలను అందజేస్తున్న జగన్మోహనరావు

ఫస్ట్ ఎయిడ్‌పై శిక్షణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం

శ్రీకాకుళం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శాఖ ఆధ్వర్యాన బేసిక్ ఫస్ట్ ఎయిడ్, ఎనిమిది రోజులు సీనియర్ ప్రొఫెషనల్ ఫస్ట్ ఎయిడ్ బుధవారం శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తిచేసుకుని వారికి ధ్రువపత్రాలను రెడ్‌క్రాస్ చైర్మన్ జి.జగన్మోహనరావు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ శిక్షణ అనంతరం వైద్య ఆరోగ్య శాఖలో, ప్రయివేటు ఆస్పత్రుల్లో, కర్మాగారాల్లో ఉద్యోగ అవకాశం పొందే అవకాశం ఉందని అన్నారు. ఇదివరకు శిక్షణ పూర్తి చేసుకుని ఉన్న అభ్యర్థులకు నేషనల్ హెడ్ క్వార్టర్స్ న్యూఢిల్లీ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, సెయింట్ జాన్ అంబులెన్స్ వారి జారీ సిందన్నారు. ఈ ధ్రువపత్రాలు భారతదేశంలో స్థాయిలో ఉపయోగపడతాయని తెలియజేశారు. శిక్షణ కావాల్సిన అభ్యర్థులు నేరుగా రెడ్‌క్రాస్ కార్యాలయానికి గాని, 9450490525 సెల్ నంబర్‌కు గాని సంప్రదించగలరు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు కె.సత్య నారాయణ, జి.రమణ పాల్గొన్నారు.

విద్యార్థికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న లయన్స్ ప్రతినిధులు

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

చదరంగం క్రీడతో ఉత్తమ క్రమశిక్షణ అలవడుతుందని, విద్యార్థులు చదువులోను, క్రీడల్లోను రాణించాలని లయన్స్ ఇంటర్నేషనల్ జోన్ చైర్మన్ పొన్నాడ రవికుమార్ అన్నారు. స్థానిక రెడ్‌క్రాస్ నైపుణ్యాభివృద్ధి భవనంలో చదరంగం పోటీలను లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ సభ్యులతో కలిసి ప్రారంభించారు. స్కూల్ అఫ్ చెస్ అకాడమీ బేరి చిన్నారావు ఆధ్వర్యంలో చిల్డ్రన్స్ చెస్ చాంపియన్ టోర్నమెంట్ ఉత్సాహంగా నిర్వహించడం జరిగిందన్నారు. నగరంలోని విద్యార్థులతో పాటు, విశాఖపట్నం నుంచి కూడా విద్యార్థులు సుమారు వందమంది పాల్గొన్నారన్నారు. ఐదు రౌండ్లపాటు జరిగిన చెస్ పోటీల్లో విద్యార్థులు అసక్తిగా పాల్గొన్నారని, చదరంగం క్రీడతో మానసిక ఆనందం కలుగుతుందన్నారు. అనంతరం చెస్ విజేతలకు రెడ్‌క్రాస్ చైర్మన్ పి. జగన్ మోహనరావు, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ మెంటర్ నటుకుల మోహన్, నూతన అధ్యక్షురాలు లయన్ డా.పైడి.సింధూర చేతులమీదుగా ప్రశంసాపత్రాలను, బంగారు పతకాలను, జ్ఞాపికలను ప్రదానం చేసి అభినందించారు. కార్యక్రమంలో క్రీడాకారులు, తల్లిదండ్రులు, లయన్స్ క్లబ్ నూతన కార్యదర్శి టెక్కం రామ్ గోపాల్, నూతన ఉపాధ్యక్షులు ఉర్లం శివతేజ పట్నాయక్, సీనియర్ సభ్యులు శిల్లా మణి, మానవత సభ్యులు డాక్టర్ చింతాడ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి ఇంటర్నెట్ బాక్స్‌ను అందజేస్తున్న మల్లేశ్వరరావు

సచివాలయానికి ఇంటర్నెట్

బూర్జ: మండలంలోని కాలపర్తి సచివాలయానికి గత ఐదేళ్లుగా ఇంటర్నెట్ సదుపాయం లేకపోవడంతో ప్రభుత్వం అందించే సేవలను ప్రజలకు చేరవేయడంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సచివాలయ సిబ్బంది తెలిపారు. ఈ సమస్యను మాజీ సర్పంచ్ బగాది శ్రీరామమూర్తి, కోరుకొండ రామినాయుడు ద్వారా తెలుసుకున్న జనసేన ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి కోరుకొండ మల్లేశ్వరరావు వెంటనే స్పందించి బుధవారం సచివాలయానికి ఇంటర్నెట్ కనెక్షన్ ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా కొత్తగా ఏర్పాటు చేసిన ఇంటర్నెట్ సేవలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది మల్లేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయ పున:ప్రతిష్ట

సోంపేట : మండలంలోని కొర్లాం పంచాయతీ గొనకపాడులో బుధవారం భూలోక మాత ఆలయ పున:ప్రతిష్ట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పూర్ణ చంద్ర పాణిగ్రాహి ఆధ్వర్యాన పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం 200 మందికి అన్నదానం నిర్వహించారు.

బడిఈడు పిల్లల సర్వే

పొందూరు: పట్టణంలో బడిఈడు పిల్లల సర్వేను బుధవారం విద్యాశాఖాధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా పొందూరులో వికలాంగ విద్యార్థిని గుర్తించారు. అనంతరం ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలతో పాటు స్థానిక భవిత కేంద్రంలో అందిస్తున్న విద్యపై తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష జిల్లా కో-ఆర్డినేటర్ బి.గోవిందరావు, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ కె.రాంబాబు, ఎంఇఒలు శ్రీరాములు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం మెరుగు

ప్రజాశక్తి- మందస

మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ వెంకటరమణ అధ్యక్షతన యోగాంధ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది యోగాసనాలు వేశారు. అనంతరం కార్యాలయం నుంచి అవగాహనా ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో ఎఒ రషేశ్వరరావు, డిప్యూటీ ఎంపిడిఒ జయప్రకాష్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రమేష్ ఆధ్వర్యాన సిబ్బంది, వార్డు సెక్రటరీలు, మెప్మా సిబ్బంది యోగాసనాలు వేశారు. ట్రైనర్‌గా పతంజలి, యోగాశ్రమం సంజీవ్‌రెడ్డి పర్యవేక్షించారు.

ఘనంగా ఎన్‌టిఆర్ జయంతి

రణస్థలం రూరల్ : రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

లావేరు : పూలమాలలు వేసి నివాళ్లర్పిస్తున్న తోటయ్యదొర తదితరులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మాజీ సిఎం నందమూరి తారక రామారావు జయంతి వేడుకలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి జిల్లా గ్రంథా లయ కార్యదర్శి బుర్రి కుమార్ రాజా పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం వేసవి శిక్షణా శిబిరంలో టాయ్స్ ఎగ్జిబిషన్స్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ వివిజిఎస్ శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ పి.వి. భాస్కర్‌రాజా, ఉపాధ్యాయులు ప్రభాకర్, రాజశేఖర్, సిబ్బంది రామ్మోహన్, గణేష్ పాల్గొన్నారు.

లావేరు: మాజీ సిఎం నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా మండల కేంద్రమైన లావేరు కూడలిలో ఎచ్చెర్ల మాజీ ఎఎంసి చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు లంకలపల్లి శ్రీనువాస రావు, బాసిన ప్రకాశం, మాజీ జెడ్‌పిటిసి ఎన్.త్రినాధరావు, యినపకుర్తి రమణ, లంకలపల్లి బాబు, ఆనంద్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అలాగే ఎంపిడిఒ కార్యాలయంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి ఎంపిడిఒ పి.వెంకటరాజు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఎంఇఒ మజ్జి మురళీకృష్ణ సూపరిం టెండెంట్ సునీత, కార్యదర్శులు పాల్గొన్నారు.

స్థానిక శాఖా గ్రంథాలయములో ఎన్‌టిఆర్ చిత్రపటానికి గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు గ్రంథాలయం తరుపున బహు మతులు అందజేశారు.పి. మల్లేశ్వరరావు, గ్రంథాలయ సహాయకుడు వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ జయంతి సందర్భంగా పట్టణ శివారున ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి జిల్లా కార్యదర్శి మొదలవలస రమేష్ పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మాజీ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కణితి విజయలక్ష్మి భాయ్, సర్పంచ్‌లు నేతింటి జ్యోతీశ్వరరావు, గొండు రమణ, టిడిపి నాయకులు రాడ విజయ కుమార్, బగాన అమ్మినాయుడు, పాతిన రమణమూర్తి, గొల్లపల్లి సింహాద్రి పాల్గొన్నారు.

అలాగే ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ రోణంకి వెంకటరావు ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్ల ర్పించారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ ఎఒ వాసుదేవరావు, సీనియర్ అసిస్టెంట్ రమణమూర్తి, టి.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: మండల కేంద్రంలోని రామతీర్థం కూడలి వద్ద ఎన్‌టిఆర్ జయంతి నిర్వహించారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం కొండములగాం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పిసిని జగన్నాధం నాయుడు, డిజిఎం ఆనందరావు, లంక అప్పలనాయుడు, ప్రభ, అప్పడుదొర, శ్రీనివాసరావు, రామారావు, లక్ష్మి ప్రసాద్, లక్ష్మణరావు, రమణ, హరికృష్ణ, స్వామినాయుడు పాల్గొన్నారు.

టెక్కలి: సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి పూలమాలలు వేశారు. అలాగే స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్ పూలమాలలు వేశారు.

కవిటి : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి నందమూరి తారక రామారావు అని టిడిపి నాయకులు బెందాళం రమేష్, సీపాన వెంకటరమణ, బార్ల చినబాబు అన్నారు. కవిటి బస్టాండ్ కూడలిలోని ఎన్‌టిఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఆరింగి మధు, బెందాళం విజయ్, లోల్ల శ్రీను, కొర్రాయి వాసు, బాసు దేవ్ రౌలో, సంతోష్ పట్నాయక్ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : వజ్రపుకొత్తూరు, బాతుపురం, అక్కుపల్లి గ్రామాల్లోని ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి నాయకులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు దువ్వాడ హేమబాబు చౌదరి, ఎ.ఉమామహేశ్వరరావు, కోణారి కిరణ్ కుమార్, నెయ్యిల సూర్యనారాయణ, కణితి సురేష్ పాల్గొన్నారు.

నరసన్నపేట: మండల పరిషత్, తహశీల్దార్ కార్యాలయాల్లో ఎన్‌టిఆర్ చిత్రపటాలకు అధికారులు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బి.మధుసూదనరావు, తహశీల్దార్ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

పోలాకి: పోలాకి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ జి.రవికుమార్ సూపరింటెండెంట్ సూర్యప్రకాష్, సీనియర్ అసిస్టెంట్ విజయకుమార్‌లు ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు.

ఇచ్ఛాపురం : స్థానిక బస్టాండ్ కూడలి వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి నాయకులు పూలమాలలు వేశారు. అనంతరం కమ్యూనిటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పళ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కాళ్ల ధర్మారావు, దక్కత ఢిల్లీరావు, నందిక జాని, మెరుగు సూర్యనారాయణరెడ్డి, సహదేవ్‌రెడ్డి, పత్రీ తవిటయ్య, దక్కత శ్రీను, కామేశ్వరరావు, జయదేవ్ పాల్గొన్నారు. అలాగే తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ వెంకటరావు, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రమేష్ ఎన్‌టిఆర్ చిత్రపటాలకు పూలమాలలు వేశారు.

పలాస : పలాస టిడిపి కార్యాలయం, కాశీబుగ్గ బస్టాండ్ ఆవరణలో ఎన్‌టిఆర్ విగ్రహానికి, చిత్రపటానికి మాజీ మంత్రి గౌతు శ్యాంసుందర శివాజీ పూలమాలలు వేశారు. అనంతరం కాశీబుగ్గ అన్న క్యాంటీన్, సాయిరాం మందిరంలో పేదలకు ఉచితంగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి : చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఆర్‌డిఒ కృష్ణమూర్తి

శ్రీకాకుళం : ఎన్‌టిఆర్ చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న కుమార్ రాజా

ఆమదాలవలస : పూలమాల వేస్తున్న ఎంపిడిఒ వెంకటరావు

వర్షాలపై అప్రమత్తం

ప్రజాశక్తి- బూర్జ

ప్రవల్లిక, ఎస్ఐ

మండలంలో అల్పపీడనం ప్రభావంతో విస్తృతంగా వర్షాలు కురుస్తున్నాయి. వర్షం కారణంగా రోడ్లపై వర్షంనీరు నిలిచి ఉండటం, పలుచోట్ల గుంతలు ఏర్పడటం వల్ల వాహనదారులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని ఎస్ఐ ప్రవల్లిక హెచ్చరించారు. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, ముందుగా పరిసరాలను గమనించి తగిన వేగంతో ప్రయాణించాలని ఆమె సూచించారు. అలాగే వర్ష సమయంలో చెట్లకింద, విద్యుత్ తీగలు, స్తంభాలు లేదా దెబ్బతిన్న భవనాల దగ్గర ఉండరాదని ఆమె అన్నారు. ముందస్తు జాగ్రత్తలు ప్రతిఒక్కరూ పాటించాలని, అత్యవసర పరిస్థితుల్లో పోలీసులను లేదా విద్యుత్ శాఖ అధికారులను సంప్రదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అవార్డు అందుకుంటున్న శామ్యూల్

పాతపట్నం వాసికి గిన్నిస్ బుక్‌లో చోటు

పాతపట్నం: విజయవాడకు చెందిన హలెల్ మ్యూజిక్ స్కూల్ యాజమాన్యం గతేడాది డిసెంబరు 1న నిర్వహించిన ఆన్‌లైన్ పోటీల్లో విక్టర్ శామ్యూల్ పాల్గొన్నారు. గంటలో మ్యూజిక్ కీబోర్డ్‌లో 1090 రకాల శబ్దాలను వినిపించారు. దీంతో పాతపట్నం మేజర్ పంచాయతీకి చెందిన శామ్యూల్‌కు గిన్నిస్ బుక్‌లో చోటు కల్పించారు. మంగళవారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును నిర్వాహకులు అందజేశారు.

శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి అభినందనలు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం బెల్లుపడ జాతీయ రహదారి కూడలి వద్ద ఈదుపురానికి వెళ్లే మార్గంలో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని సీడాప్ మాజీ చైర్మన్ శ్యామ్ ప్రసాద్‌రెడ్డి అన్నారు. ఇదే సమస్యపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానని అన్నారు. అధికారులు స్పందించి అండర్ పాస్ వే నిర్మాణానికి చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. మున్సిపాలిటీ నుంచి ఈదుపురం వైపు వెళ్లే మార్గంలో హైవే పాయింట్ వద్ద అండర్ పాసేజ్ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయడం సంతోషిస్తున్నాని తెలిపారు.

స్నేహిత ఫౌండేషన్ ఉదారత

ఆర్థికసాయం అందించిన సభ్యులు

కవిటి: స్నేహిత ఫౌండేషన్ తన ఉదాహరణ చాటు కుంది. రోడ్డు ప్రమాదంలో గాయ పడిన దేవాడపుట్టుగకు చెందిన దేవాడ లక్ష్మణ్ ఏడాది పాటు ఇంట్లోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో రెక్కాడితే గానీ డొక్కాడని అతని కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉంది. విషయం తెలుసుకున్న స్నేహితా ఫౌండేషన్ సభ్యులు బుధవారం గ్రామానికి చేరుకుని లక్ష్మణ్ యోగ క్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం రూ.5 వేల ఆర్థికసాయం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన లక్ష్మణ్‌కు దాతలు అండగా నిలబ డాలని కోరారు. స్నేహితా ఫౌండేషన్‌సభ్యులు పాల్గొన్నారు.

దళితుల భూములు అప్పగింత

మిగిలిన భూములను పేదలకు అప్పగించాలి

ప్రజాశక్తి- బూర్జ

మండలంలో అన్నంపేట గ్రామానికి సంబంధించిన సుమారు 25 మంది రైతులకు తరతరాల నుంచి వస్తున్న భూములు 25 ఎకరాలు మంగుపల్లి సూర్యప్రకాష్ అనే వ్యక్తి ఇటీవల రెవెన్యూ అధికారులు, స్థానిక నాయకులు అడ్డు పెట్టుకొని ఆ భూముల వద్ద సిమెంట్ స్తంభాలు వేయగా దానిపై రైతులు తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోవడంతో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గంగరావు సింహాచలంను సంప్రదించగా మే 21న వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహశీల్దార్ వై.వి.పద్మావతికి వినతిపత్రం అందించారు. పూర్తిస్థాయిలో అధికారులతో పరిశీలించి 1985లో దళితులకు డి పట్టాల కింద పట్టాల అందజేయడం జరిగిందని, దళితులు భూములను మంగుపల్లి సూర్యప్రకాష్ ఎలా స్వాధీనం చేసుకుంటావని రైతులు ముందు ఆయనకు వివరణ కోరారు. ఇవి పూర్తిగా దళితుల భూములని, ఆ భూములపైకి ఎవరైనా పెత్తనదారులు వెళ్తే చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ హెచ్చరించారు. దీంతో బుధవారం వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు సింహాచలంతో పాటు రైతులు పొన్నాడ గౌరమ్మ, దంత శ్రీరాము, దన్నాన లక్ష్మి, సాకేటి అప్పారావు, గణపతి, సూర్యనారాయణ, కె.లక్ష్మి, నేతల వెంకటమ్మ, రవణమ్మ తదితర రైతుల భూముల వద్ద సిమెంట్ స్తంభాలను తీసి సాగు చేయాలని ఆయన తెలిపారు. అలాగే మిగిలిన బిసి వర్గానికి చెందిన పేదల భూములను పేదలకు అప్పగించాలని, అప్పగించకపోతే పోరాటం ఆగదని ఆయన హెచ్చరించారు.

రైతులతో సిమెంట్ స్తంభాలను తీయిస్తున్న సింహాచలం

మీనాక్షి ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

తొలగించిన కణితి

శ్రీకాకుళం: నగరంలోని మీనాక్షి ఆస్పత్రిలో అరుదైన, అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయ వంతంగా నిర్వహిం చినట్టు సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ గొండు గంగాధరరావు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ 36 ఏళ్ల యువకుడు కొంత కాలంగా చాలా తక్కువ ప్లేట్లెట్ కౌంట్‌తో కూడిన రుగ్మతతో బాధపడు తున్నాడు. దీని కారణంగా అతనికి ప్లేహం (బల్ల) పెరిగి (సుమారు 50 సెం.మీ) ఉదర భాగం మొత్తం వ్యాపించడంతో, అతనికి ప్లేట్లెట్ కౌంట్ ఇంకా తగ్గడం, రక్తం గడ్డకట్టే శక్తి నశించడం, రక్తహీనత, తెల్లరక్త కణాలు తగ్గడం (వ్యాధినిరోధక శక్తి నశించడం), ఆహారం తీసుకోలేక పోవడం, ఎటువంటి తేలికపాటి పనికూడా చేసుకోలేకపోవడంతో ఆరోగ్యం బాగా క్షీణించి, మీనాక్షి ఆస్పత్రిని సంప్రదించాడన్నారు. ఆ యువకుడికి పరీక్షలు నిర్వహించి, శస్త్రచికిత్స అవసరం అని గుర్తించినట్టు తెలిపారు. శస్త్రచికిత్స చేసే సమయంలో ఆయనకు కేవలం ఏడు గ్రాముల హిమోగ్లోబిన్, 16,000 ప్లేట్లెట్ కౌంట్ ఉందని, ఇటువంటి పరిస్థితుల్లో రక్తం గడ్డకట్టే సామర్థ్యం చాలా తక్కువగా ఉండి, శస్త్రచికిత్స సమయంలో ప్రాణాంతకమైన రక్తస్రావం జరిగే అవకాశం ఉంటుం దన్నారు. శస్త్ర చికిత్సను అత్యంత నైపుణ్యంతో, ఎటువంటి రక్తస్రావం జరగకుండా, ప్లేహాన్ని విజయవంతంగా తొలగిం చడం జరిగిందన్నారు. తొలగించిన ప్లేహం సుమారు 40 సెం.మీ, నాలుగు కిలోగ్రాములు ఉన్నట్లు గుర్తించారు. శస్త్రచికిత్స అనంతరం పేషెంట్ కోలుకొని, 3.5 లక్షల ప్లేట్లెట్ కౌంట్‌తో ఆరోగ్యంగా డిశ్చార్జ్ అయ్యాడని తెలిపారు.

సందడిగా నిర్వహిస్తున్న వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు

జిల్లా స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు

పొందూరు: మండలంలోని బురిడికంచరాంలో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లాస్థాయి సంగిడీలు, వెయిట్‌లిఫ్టింగ్, విసురుగుండు పోటీలను నిర్వహించారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ వెయిట్‌లిఫ్టర్ ఇప్పిలి అప్పన్న ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వెయిట్ లిఫ్టింగ్‌తో పాటు తీత సింగిడి, ఈడుపు సంగిడి, విసురుగుండు పోటీల్లో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పెత్తఎత్తున పాల్గొన్నారు. అలాగే 40 కెజిల నుంచి 150 కెజిల వెయిట్‌లిఫ్టింగ్ పోటీలను నిర్వహించారు. కార్యక్ర మంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారులు

వజ్రపుకొత్తూరు: మండలంలో రహదారుల పరిస్థితి అధ్వానంగా తయారయ్యాయి. మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రహదారులు ఛిద్రంగా తయారయ్యాయి. బెండి గేట్ నుంచి వజ్రపుకొత్తూరు మండల కేంద్రానికి వెళ్లే రోడ్డు పలుచోట్ల పూర్తిగా దెబ్బతిని గోతులతో జలమయమైంది. బెండి గేట్ ఆశ్రం మలుపు వద్ద నీటితో నిండిన గోతులుతో ప్రయా ణికులు, వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. మూడేళ్ల క్రితం రహదారి పనులు ప్రారంభించారు. ఆ సమయంలో రహదారి తవ్వేసి పనులు అర్థాంతరంగా వదిలివేయడంతో ప్రయాణికులకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి పనులు వెంటనే ప్రారంభించాలని ఇటీవల సిపిఎం ఆధ్వర్యాన పోరుయాత్ర చేపట్టిన విషయం విదితమే. పూండి, మంచినీళ్లపేట రహదారి మరమ్మతు పనుల కోసం ఐదు నెలల క్రితం తవ్వేసి వదిలేశారు. పూడి-జగన్నాథపురం గ్రామం మధ్య నుంచి వెళ్లే రహదారి సక్రమంగా లేకపోవడంతో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి నీరు ఇంట్లోకి చేరడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు.

అధ్వానంగా ఉన్న రోడ్డు

కొట్లాటలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి- కవిటి

గాయపడిన హరికృష్ణ

ఎప్పటి నుంచో కొనసాగుతున్న ఆస్తి తగాద చిలికి చిలికి గాలివానలా మారి చివరికి కొట్లాటకు దారితీసింది. ఈ కోట్లలో ఒకరికి తీవ్రమైన గాయలవ్వగా, ఇంకొకరు స్వల్పంగా గాయపడ్డారు. ఎస్ఐ రవివర్మ అందించిన సమాచారం మేరకు కవిటి మండలం డి.జి.పుట్టుగకు చెందిన బోనెల హరికృష్ణ, బోనెల రవికుమార్, తెంబ పవన్, తెంబ ధనలక్ష్మి, తెంబ సరోజిని, రట్టి భారతి మధ్య ఎప్పటి నుంచో ఆస్తి తగాదాలు ఉన్నాయి. అందులో భాగంగానే బుధవారం ఉదయం 7.30 గంటల సమ యంలో తోటలో ఉన్న కొబ్బరి కాయల విషయంలో వీరి మధ్య గొడవ మొదలైంది. ఈ గొడవలో ఇద్దరికి గాయాలవ్వగా, కవిటి ప్రభుత్వా స్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఆస్పత్రి వర్గాలు అందించిన సమాచారం మేరకు ఇరువురి మీద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రవివర్మ తెలిపారు.

పట్టుబడిన నాటుసారా

నాటుసారాతో వ్యక్తి అరెస్టు

సోంపేట : సోంపేట ఎక్సైజ్ పరిధిలోని మందస మండలం బుడారిసింగి గ్రామ సమీపంలో బుధవారం 30 లీటర్ల నాటుసారాతో రవీంద్రను అరెస్టు చేసినట్లు సిఐ రవణ తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరు పర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది మార్కారావు, భానుప్రసాద్ పాల్గొన్నట్లు తెలిపారు.

నిల్వ ఉన్న వర్షపునీరు

చినుకు పడితే చిత్తడే

టెక్కలి రూరల్: టెక్కలి మేజర్ పంచాయతీలో ప్రస్తుతం కురిసిన వర్షానికి రోటరీనగర్, శ్రీనివాస్ నగర్, మండపాలం కాలనీ ఇళ్లు జలమయ్యాయి. కాలువల్లో పూడికలు తొలగించకపోవడతో వర్షపు నీరు వెళ్లక ఇళ్లలోనే ఉండిపోవడంతో ఇంటి యజ మానులు అవస్థలు పడుతున్నారు. పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఇఒ స్పందించలేదని వాపోతున్నారు. పంచాయతీ సిబ్బంది వెంటనే అక్రమ ణలు తొలగించి కాలువలో పూడికలను తొలగిం చాలని నాయకులు నంబూరి షణ్ముఖరావు డిమాండ్ చేశారు.

లోకేష్‌తో ఎమ్మెల్యే ఎంజిఆర్

మహానాడుకు రూ.పది లక్షలు విరాళం

పాతపట్నం: కడపలో నిర్వహించిన టిడిపి మహానాడు కార్యక్రమానికి ఎమ్మెల్యే మామిడి గోవిందరావు రూ.పదిలక్షలు విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా చెక్కును విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడిపి కుటుంబ సభ్యులతో కలిసి పండగలా మహానాడును నిర్వహించారన్నారు. ఐదు మండలాల నాయకులు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు.

మహిళల ఆరోగ్యంపై అవగాహన

ఇచ్ఛాపురం: ఆరోగ్యంపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యురాలు జూహిత అన్నారు. స్థానిక పురుషోత్తంపురం అర్బన్ హెల్త్ సెంటర్‌లో బుధవారం మహిళల ఆరోగ్యంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. బహుళ గర్భధారణ, పునరుత్పత్తి వయసు, పాలిచ్చే తల్లులను హిమోగ్లోబిన్ స్థాయిల కోసం పరీక్షించాలని సూచించారు. వార్డు కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్‌కుమార్, చాట్ల తిరుపతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై నిలిచిపోయిన వాహనాలు

ట్రాఫిక్ జామ్

- ఐదు గంటలు నిలిచిన వాహనాలు
- అవస్థలు పడిన ప్రజలు, వాహన దారులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జి.సిగడాం మండలం ఆనందపుర అగ్రహారంలో బుధవారం గ్రామ దేవత ఉత్సవాలకు వెళ్లిన ప్రజలు, ప్రయాణికులు, వాహనదారుల బాధలు వర్ణణాతీతం. చిలకపాలెం నుంచి రాజాం వెళ్లే రహదారిలో పొందూరు నుంచి సంతవురిటి వరకు సుమారు ఐదు కిలోమీటర్ల వరకు ఐదు గంటల పాటు వాహనాలు నిలిచిపోయాయి. అనందపుర అగ్రహారం వద్ద సింగిల్ బ్రిడ్జి కారణంగానే వాహన దారులు చాలా ఇబ్బందులు పడ్డారు. గ్రామంలోకి వెళ్లే ప్రజలు కూడా రెండు కిలోమీటర్ల దూరంలో వాహనాలు నిలిపివేసి అక్కడ నుంచి నడుచుకుని పొలాల్లో నుంచి వెళ్లాల్సి వచ్చింది. రాజాం, బొబ్బిలి, సాలూరు, పాలకొండ, రాజాం నుంచి విశాఖ వెళ్లాల్సిన బస్సులన్ని మూడు నుంచి నాలుగు గంటలు ట్రాఫిక్‌లో నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. అలాగే ఆనందపుర అగ్రహారంలో కూడా ఇరుకు రోడ్లు కావడంతో కిక్కిరిసిన ప్రజలతో నానా ఇబ్బందులు పడ్డారు. ఎస్ఐ వై.మధు సూదనరావు సిబ్బందితో ట్రాఫిక్ ఇబ్బందులు కొంతవరకు క్లియర్ చేశారు.

పంట పొలాల్లో నుంచి గ్రామానికి చేరుకుంటున్న ప్రజలు

స్తంభించిన ప్రజా రవాణా

- అధికారుల తీరుపై అసహనం
- వారం రోజులుగా ఇక్కట్లు

టెక్కలి: స్థానిక గోపినాథపురం కూడలి వద్ద నిర్మిస్తున్న కల్వర్టు పునరుద్ధరణ నిర్మాణం పనులు అలసత్వంపై రోడ్లు, భవనాల శాఖ అధికారుల అలసత్వ తీరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కల్వర్టు నిర్మాణం పనులు నిమిత్తం ప్రధాన రాష్ట్ర రహదారి అయిన నౌపడ- మెళియాపుట్టి రోడ్డులో ప్రజా రవాణా స్తంభించింది. ఎన్ఎం రోడ్డుగా పిలుస్తున్న ఈ మార్గంలో కల్వర్టు మరమ్మతులకు గురైంది. పనులు ప్రారంభించి వారం రోజులు అవుతుంది. ఇప్పటికీ పనులు పూర్తి కాకపోవడంతో ఈ రోడ్డులో రాకపోకలు నిలిచిపోయాయి. మరమ్మతులు చేపట్టాలంటే ముందుగా డైవర్షన్ రోడ్డు చూపాలి. లేకుంటే మరమ్మతులు పనులు చేస్తున్న తరుణంలో ఒకపక్క నుంచి అయినా రవాణాకు అనుమతులు ఇవ్వాలి. ఇవేవీ నిబంధనలు పాటించకుండా రోడ్డు, భవనాలశాఖ అధికారులు చేపడు తున్న పనులు జాప్యం వల్ల ఆ మార్గంలో ప్రయాణించే ప్రజలు, వాహనదారులు, ద్విచక్రవాహనదారులు, పలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. కనీసం రోగులను తీసుకొచ్చే అంబులెన్స్ కూడా రాలేని పరిస్థితి ఏర్పడింది. నౌపడ రైల్వే కూడలికి వెళ్లే ప్రధాన మార్గం ఇదే కావడం, ఈ రోడ్డు మీదుగానే సుమారు 30 గ్రామాలకు వెళ్లేందుకూ ఇదే మార్గం. ఈ మార్గం ద్వారా నౌపడ రైల్వే కూడలికి వెళ్లేందుకు నాలుగు కిలోమీటర్లు దూరం ఉండేది. కానీ, రోడ్డు స్తంభన వల్ల పదిహేను కిలోమీటర్లు దూరం ప్రయాణించి నౌపడ కూడలికి చేరుకోవాల్సిన పరిస్థితి. అలాగే టెక్కలి ఆర్‌టిసికి సుమారు రూ.5 లక్షల వరకు ఆదాయాన్ని కోల్పోవాల్సి వచ్చిందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబ ంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుపై బెర్మ్‌లను ఏర్పాటు చేసిన అధికారులు